# 18. మీ దయ; మా ఆనందం

**సుమారు** పదిహేడేళ్ల కిందటి మాట. నేను విశాఖపట్నానికి ఉద్యోగరీత్యా రావడం కొత్త. ఓ చిన్నవాటా అద్దెకి తీసుకొని కాలక్షేపం చేస్తున్నాను. ఎవరైనా అతిథులు వస్తే ఉన్నగది ఇల్లాలికీ, పిల్లలకీ వదిలేసి అతిథులతో బాటుగా నేనూ వరండాలో పడుకునే అలవాటు చేసుకున్నాను. అలాంటి ఒకరోజున, విశాఖపట్నం లోనే కొన్నాళ్లబట్టీ చదివిందే చదువుతూ ఎన్నాళ్ళకీ వొడ్డెక్కని ఓ స్టూడెంటు కుర్రాడు- పేరు దయానందం - రాత్రి తొమ్మిది గంటల వేళపుడు వొచ్చి గురూగారూ ఈ రాత్రికి మీ ఇంట్లో తిష్ఠ వేస్తున్నానన్నాడు. నా కథలూ కాకరకాయలూ చదివి బలేరాశార్సార్ అంటూ అప్పుడపుడు నన్ను మెచ్చుకోవడం వుండేది. అందువల్ల "ఓ, దానికేం?" అంటూ అతనికి కూడా ఓ చాపా, బొంతా, తలగడా, దుప్పటి తెచ్చి వరండాలోసెటిలయ్యాకనే అసలు ప్రశ్న అడిగాను. "నీకొక రూమ్ ఉంది కదా; మరేమిటి ఇలా కాందిశీకుడివై వచ్చావు?" అని.

"ఏమిటి చెప్పమంటారు! మా అన్నయ్య మా వూర్నించి ఉత్తరం రాసి పంపేడు ఒక ఆసామీని. అతని పెళ్లానికి ఆస్పత్రిలో ఏవో పరీక్షలు చేయించి తీసుకెళ్లాలిట. ఇవాళ ఉదయాన్నే దిగాడు. వాళ్లకి నారూమ్ వదిలేసి నేనిలా వొచ్చాను." అన్నాడు. "తెల్లారగానే లేచి వెళ్ళిపోతాను లెండి" అన్నాడు.

"తెల్లారగానే కాకపోతే కాఫీ టిఫినూ స్నానం అయ్యేకే వెళ్లు, దానికేం వుంది?" అని అతన్ని సముదాయించేను.

ఆ తర్వాత ఒక నాడు నేను ఏదో వూరికి క్యాంపెళ్లి రైల్లో విశాఖపట్నం వొచ్చినపుడు వాల్తేరు స్టేషన్‌లో కనబడ్డాడు దయానందం. స్కూటర్ ఒకటి సంపాదించినట్టున్నాడు. హేండిల్‌మీద చెయ్యి, ఫుట్ రెస్టుమీద కాలూ వేసి ఎవరితోనో మాట్లాడుతున్నాడు. 'హలో' అని పలకరించేను కాని అప్పటికే స్కూటర్ స్టార్ట్‌చేసి రెండో మనిషిని వెనకాల కూర్చోపెట్టుకొని బయలు దేరేసేడు. నేను నిస్సహాయంగా చూస్తుంటే వెనకాల కూచున్న మనిషి నావేపు తిరిగి "ఆఫీసులో కలుస్తాను" అని కేకేశాడు. నేనింతసేపూ వెనకాల కూర్చున్న అచ్యుతరావు సంగతే గమనించలేదు. ఆ అచ్యుతరావూ నేనూ హైద్రాబాద్‌లో ఆరేళ్లు కలిసి పనిచేశాం.

ఆ మధ్యాహ్నం అచ్యుతరావు మా ఆఫీసుకొచ్చి నన్ను పలకరించేడు. 'సారీ బ్రదర్. ఉదయం నువ్వు పలకరించినా మాట్లాడలేకపోయాను. అర్జంటుగా ఎక్కడోవో దగ్గర సెటిలైపోయే తొందర.' అన్నాడు.

"దయానందం రూమ్‌లో దిగేవా?" అన్నాను.

"దయానందమో, ప్రేమానందమో! రైలు దిగి ఇవతలికొచ్చేసరికి - 'ఎక్కడికి సార్; స్కూటర్‌మీద దింపేస్తాను -' అన్నాడు. 'నవోదయ లాడ్జికి' అన్నాను. నాలుగురూపాయ లివ్వండిసార్ అన్నాడు. నన్ను లాడ్జిలో దించేసి నాలుగు రూపాయలు పుచ్చుకు వెళ్లాడు. ఆటోలులేవు. రిక్షాలో వెళ్తే ఆలస్యం అయిపోతుందనుకుంటూ వుండగా అతనలా తీసికెళ్తే థాంక్సు తప్ప వేరే మాట అతనితో నేను అనలేదు." అని వివరించేడు అచ్యుతరావు.

మా సంభాషణ వింటూ ఉన్న నా సహాధ్యాయి శంకర్రావు హటాత్తుగా కలగచేసుకొని "స్కూటర్ నెంబరు 9889?" అన్నాడు అదోలా నవ్వి.

"అవును, అదే!" అన్నాడు అచ్యుతరావు.

శంకర్రావు నాతో చెప్పాడు. "ఆ అబ్బాయి ఎమ్మే చదువుదామని ఈ వూరు వొచ్చాడండి. ఏం కారణమో మరిగాని చదువు సరిగా సాగలేదు. ఫైనలియర్ పరిక్ష నాలుగుసార్లు రాసినా పాస్ కాలేదు. ఇతగాడి వాలకం చూసి ఇంటి నుండి డబ్బు పంపడం మానేశాడు ఇతని అన్నగారు. పెట్టిపుట్టాడు కనక స్కూటరొకటి సంపాదించు కున్నాడు. రోజూ ఉదయం, మధ్యాహ్నం సాయంకాలం స్టేషన్‌కి స్కూటర్ పట్టుకెళ్లి ఒక సింగిల్ సవారీ ఎక్కించుకొని సుమారు పాతిక రూపాయలు సంపాదిస్తాడు" అని; అచ్యుతరావుకి వినపడకూడదన్నట్టు నా చెవి దగ్గిరిగా నోరుపెట్టి, ఎవరేనా "జంట" చోటుదొరక్క అవస్త పడుతూవుంటే తన రూమ్ ఓ రాత్రికో పగటికో ముప్ఫయి రూపాయలకి అద్దెకిచ్చేస్తాడు. ఆ విధంగా నెలకి కనీసం ఆరువందలు సంపాదిస్తాడు". అని చెప్పేడు.

"అయ్యో, మరి అతనికి ఇబ్బంది కదూ?" అన్నాను.

"అతనికేం ఇబ్బందండీ బాబూ! మా రూమ్‌కి ఎవరో గెస్టులొచ్చారని చెప్పేసి మా వరండాలోనో, మా వీధి అరుగుమీదనో కళ్ళు మూసుకొని కాలక్షేపం చేసేస్తాడు. ఎక్కడా వీల్లేకపోతే రైల్ స్టేషన్‌కెళ్లి ఖాళీ ఉంటే ఫస్ట్‌క్లాస్ వెయిటింగ్ రూమ్‌లోనూ ఖాళీ లేకపోతే ప్లాట్‌ఫారం బెంచీమీదనూ పడుకుంటాడు. ఉదయం లేవగానే స్కూటర్ బైటికి తీసి బేరం ఏదో సెట్‌చేసుకొని తిన్నగా రూమ్‌కొచ్చేస్తాడు. రూమ్‌లో ఉన్నవాళ్లు డబ్బుపోతే పోయింది గాని సేఫ్టీ అయినచోట చేరాం అని తృప్తిపడి ఇతనడిగిన అద్దె ఇచ్చి వెళ్తారు."

వ్యాపారానికైనా, మనిషికైనా ఒక శాపగ్రస్థ కాలం ఉంటుంది. అలాంటి కాలంలో దయానందం ఈ విధంగా తన బతుకు వెళ్లదీసుకున్నాడు. మనిషి చేసిన తప్పుల్ని కోర్టో దేవుడో క్షమించలేక శిక్షలువెయ్యాలని వుబలాట పడొచ్చుగాని పక్క మనిషి క్షమించక తప్పదు కదా.... అని నన్ను నేను సముదాయించుకున్నాను.

నేనెప్పుడూ డిసెంబర్ 31 పార్టీ లకి వెళ్లను. కాని 1989 డిసెంబర్ 31 నాకు తప్పించుకోవడానికి వీల్లేకొచ్చింది. మా రీజియనల్ మేనేజర్ గోవిందన్ ఆరోజు ఈ వూరికి క్యాంపు వచ్చి రోజంతా నావర్కు క్షుణ్ణంగా తనిఖీ చేసేడు. రాత్రి ఎనిమిది అయినా లెడ్జర్లు రిజిస్టర్లు సంతకాలవలేదు. "మనం ఈ పని వచ్చే సంవత్సరానికి వాయిదావేద్దాం..." అని నవ్వుతూ లేచాడు. ఆవేళ డిసెంబర్ 31 కనక వచ్చే సంవత్సరం అంటే రేపే. ఆ జోక్‌కి నేను నవ్వకపోతే అనతు నాబాస్ అయినా కాకపోయినా నేను అతనికి స్టాఫ్ కాను. అంచేత నవ్వేసి "థాంక్యూసర్, గుడ్‌నైట్" అని ఇంటికి ప్రయాణమ య్యేను. "నోనో, నువ్వు నాతోరావాలి. ఒక గొప్ప పార్టీఉంది ఈ రాత్రి పన్నెండు గంటల దాకా బూజింగు, అప్పుడు హాపీ న్యూఇయర్ చెప్పి డిస్పర్స్ కావడం! అంతవరకు నువ్వు నాతో ఉండాలి, ఒక వేళ నేను ఔటైపోతే నన్ను భద్రంగా రూమ్‌కి తీసుకెళ్లాలి. నువ్వు డ్రింక్ చెయ్యవని నాకు తెలుసులే; పద" అన్నాడు.

వెళ్లడం వెళ్లడం ఈ వూళ్లో ఉన్న ఒక పవిత్ర నామం గల కళ్యాణ మంటపానికి వెళ్లేం. ఆ హాలు సాధారణంగా హిందువుల వివాహ ఉత్సవాలకి తప్పా వేరే కార్యక్రమాలకి ఇయ్యరు. అక్కడ ఈ డిసెంబర్ 31 పార్టీకి ఎలా అనుమతించేరో తెలియలేదు. తిరుపతి కొండ మీద ధూమపానం

సిగరెట్ వగైరాల అమ్మకం నిషేధం బందో బస్తుగా అమలు చేసినంత సత్పురుషుడైన అధికారి కళ్లలో దుమ్ముకొట్టి ఈ హాలు ఈ అకార్యక్రమానికి సంపాదించుకున్న మన సమకాలికుల ఘనత ఎంతని !

గోవిందన్ గారు "బూజింగు" అన్నాడే కాని అంత అసందర్భమైన పార్టీ అని నేను ఊహించలేకపోయాను. దాదాపు యాభై మంది మగవాళ్లు, ఇరవై మంది దాకా ఆడవాళ్లు ఉన్నారు. "బాల్‌రూం" రకం డాన్సు తెలిసినవాళ్లు తలో ఆడ మనిషినీ జంటగా చేసుకొని డాన్స్ చేసేరు. ఆడా మగా విచక్షణ లేకుండా తూగుతున్నారు, తూలుతున్నారు. సరే, డాన్సు లాటిది కూడా చేస్తున్నారు. కొందరు అలిసిపోయి కళ్యాణ మంటపానికి ఆనుకొని వున్న గదుల్లోకి వెళ్లిపోయి 'కాసేపు 'రెస్టు తీసుకొని' నవ్వుకుంటూ వెనక్కొచ్చేసి డాన్స్‌లోనూ పార్టీలోనూ కలుస్తున్నారు. కళ్యాణ మంటపం స్టేజిమీద ఎనిమిది మంది కుర్రాళ్లు అధునాతనమైన పాశ్చాత్య వాద్యాలు "దీర్ఘశృతిలో, తీవ్రధ్వనిలో" మోగిస్తున్నారు. మైకులు, లౌడ్‌స్పీకర్లు 24 ఛానెల్సులోంచి స్టీరియో ఫోనిక్ గా శబ్దాన్ని వాతావరణం అంతటా నింపుతూ అట్టహాసం చేస్తున్నాయి. కళ్యాణ మంటపం స్టేజిమీద గోడ అంచుకి నిలబెట్టిన వెంకటేశ్వర స్వామి, పద్మావతిదేవి నిలువెత్తు తైలవర్ణ చిత్రాలు వెలవెల బోతూ తెల్లబోతూ నిస్సహాయంగా నిలబడివున్నా సిగరెట్ల పొగలో కనబడ్డంలేదు.

టైమ్ పన్నెండు గంటలు కావస్తుండగా నల్లటి సూట్ వేసుకొని ఒక స్ఫురద్రూపి అయిన వ్యక్తి హాలు మెయిన్ గేటు లోంచి వచ్చాడు. అందిన వాళ్లకల్లా షేక్‌హేండులిస్తూ "విష్యు ఎ హేపీన్యూ ఇయర్" అని చెబుతున్నాడు. అతను దయానందం అని గుర్తు పట్టడానికి నాకు ఎక్కువటైమ్ పట్టలేదు.

గోవిందన్ గారు దయానందం తన దగ్గరికి రాగానే షేక్‌హేండ్ ఇచ్చి అతన్ని నాదగ్గర దాకా లాక్కొచ్చి నాతో అన్నాడు: "మీట్ మిస్టర్ దయానందం. డైనమిక్ పెర్సన్. డైనమైట్ లాంటివాడు. ఈ హాలు ఇతను పనిచేసే సంస్థ వారిది. ఇవాళ ఈ పార్టీకి వెన్యూకావలసి వస్తే ఇతను తన మేనకోడలి పెళ్లిఅని రాసి ఈ హాలు తన పేర తీసుకొని మనకి ఇచ్చాడు. కనకనే; ఏ నైట్‌క్లబ్‌లోనూ, లాడ్జింగుల్లోనూ సాధించలేని ఆనందం ఇతని దయవల్ల ఇక్కడ సాధ్యపడింది."

"ఐసీ; థాంక్యూ; వీరందరి తరపున!" అన్నాను ఏమీ చాతగాక.

"వెల్‌కమ్!" అన్నాడు దయానందం.

దయానందాన్ని బాధ్యత గల కోర్టులూ, దేవుడూ క్షమించినా సాటి మనిషిగా నేను క్షమించలేను.

✲

*("ఆంధ్రభూమి" డెయిలీ : 17-1-1990)*

*With best compliments from ....*

# Neelam Jute Pvt. Ltd.

***Regd. Office :***

P. B. No. 64,
Lakshmi Nilayam
Chinna Baratam Street
Srikakulam - 532 001
Phones : 22462 & 22762

●

***Admn. Office :***

4-53, S.V.G.B. Colony 'A'
Srikakulam
Phone No. 22297
Director's Res . 23062

●

***Works :***

Singupuram (Village & Post)
Srikakulam Dist.
Pin : 532 187
Phones : 28240, 28242, 28252